క్లుప్తంగా

వీధిలైటు ఏర్పాటు



శివనగర్‌లో స్తంభానికి అమర్చిన లైటు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రోడ్డును ఆనుకుని ఉన్న స్తంభానికి 6 నెలలుగా వీధిలైటు లేని విషయం తెలిసిందే. దీంతో స్థానికులు, వాహన చోదకులు రాత్రి వేళలో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. ఎట్టకేలకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఈ స్తంభానికి లైటు అమర్చారు. సమస్య పరిష్కారమవడంతో శివనగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

శ్లాబ్‌కు మరమ్మతులు



ఫోర్త్‌టౌన్ పీఎస్ సన్‌షేడ్ శ్లాబ్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సన్‌షేడ్ శ్లాబ్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. స్టేషన్ సన్‌షేడ్ శ్లాబ్ పెచ్చులూడిపోయి ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తుండటంతో ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల కిందట ఎవరూ లేని సమయంలో ఒక్కసారిగా పెచ్చులు రాలిపడటంతో ప్రమాదం తప్పింది. ఈ సమస్యపై గత నెల 29న 'ప్రమాదకరంగా శ్లాబ్' అనే శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. స్టేషన్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు.

45 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: గుట్టుగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖ రైల్వేస్టేషన్ గేట్ – 2 కారు పార్కింగ్ వద్ద రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన ఎం.డి.షరీఫ్, షారూక్‌ఖాన్, ఇన్‌షాఫ్ ఖాన్ గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు సారథ్యంలో సిబ్బంది దాడి చేసి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా 45 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని, వారిని ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. రూ.8,300 నగదు, మూడు ఫోన్లు వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

పోర్టు స్టేడియంలో మెగా వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో గురువారం వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం సభ్యులకు మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏబీ గ్రూప్, ఓఎస్‌జీ ఫౌండేషన్, వీబీ హ్యూమానిటీ ఫౌండేషన్, మెడికవర్, వీ డెంటల్, విజన్ ట్రీ ఐ ఆస్పత్రుల సౌజన్యంతో బీపీ, సుగర్, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, దంత సమస్యలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఏబీ గ్రూప్ చైర్మన్ ఎం.స్వరూప్, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, ఉపాధ్యక్షుడు నాగరాజు పట్నాయక్, ఫౌండేషన్ ప్రతినిధులు రామకృష్ణ, శివదళాయి, వెంకట్, భార్గవ్ వంశీ పాల్గొన్నారు.

పండగ వేళ అప్రమత్తం

- ఇళ్లల్లో దొంగతనాలు, సైబర్ మోసాలపై క్రైం పోలీసుల అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ దుర్గాప్రసాద్

మద్రిపాలెం: సంక్రాంతి పండగ సమీపిస్తున్న వేళ.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంచరపాలెం క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. నేటి రోజుల్లో జరుగుతున్న ఇళ్లల్లో దొంగతనాలు, సైబర్ మోసాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు గురువారం కంచపాలెం పోలీస్ స్టేషన్ పరిధి ఓల్డ్ ఐటీఐ దరి సిద్ధార్థనగర్‌లోని ఓ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్రైం సీఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్థానికులకు సూచనలిచ్చారు. ఆన్‌లైన్ మోసాలు, ఇంటి దొంగతనాలు ఎలా జరుగుతాయో అన్న విషయంపై అవగాహన కల్పించారు. సంక్రాంతికి ప్రజలు సొంతూళ్లకు వెళ్తుంటారని, ఆ సమయంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయన్న నేపథ్యంలో ఇంటిని, ఇంట్లో విలువైన వస్తువులను ఎలా భద్రపరుచుకోవాలో వివరించారు. ముందస్తు చర్యగా పోలీసులకు సమాచారం అందిస్తే నిఘా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఊర్లో ముందు లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే 100కు డయల్ చేసి సమాచారమివ్వాలని కోరారు. తద్వారా కొంతమేర దొంగతనాలను నియంత్రించవచ్చన్నారు.

లోన్ యాప్స్‌తో జాగ్రత్త..!

ఇటీవల కాలంలో పలు లోన్ యాప్స్ చేస్తున్న సైబర్ మోసాలపై స్థానికులకు సీఐ దుర్గాప్రసాద్ అవగాహన కల్పించారు. రిజర్వ్ బ్యాంక్ అనుమతి లేని లోన్ యాప్స్‌లో లోన్స్ తీసుకోవద్దని హెచ్చరించారు. అతి తక్కువ వడ్డీకే లోన్స్ ఇస్తామని ప్రజలను మభ్యపెట్టి లోన్ తీసుకున్న తరువాత వారి కుటుంబాన్ని వేధింపులకు గురిచేస్తున్న యాప్స్‌లో రుణాలు తీసుకోవద్దని సూచించారు. పర్సనల్ లోన్స్ కోసం ఫోన్‌లో వచ్చిన లింక్‌లను ప్రెస్ చేయవద్దని, నకిలీ యాప్స్‌తో జాగ్రత్తగా ఉండాలని, వాటిని డౌన్‌లోడ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో సంక్రాంతి పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రైం ఎస్ఐ సునీల్, ఏఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



14వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు



25వ వార్డులో కొత్తగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులో గురువారం కార్పొరేటర్ కతారి అనిల్‌కుమార్‌రాజు లబ్ధిదారులకు కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో 1,008 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు కాగా.. 14వ వార్డులో 45 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. అవ్వాతాతలకు ఆసరాగా వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచి ప్రభుత్వం అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంట్లో పెద్ద కొడుకు పాత్ర పోషిస్తున్నారని ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోడూరు సత్యనారాయణ, శ్రీనివాస్, రాజకుమారి, నీలిమ, ప్రవీణ వర్మ, భోగలింగేశ్వరావు, తుల సీరాం, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

25వ వార్డులో 81 మందికి..

సీతంపేట: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను మధురానగర్ సచివాలయంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25వ వార్డులో ఇప్పటివరకు 1,306 మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారని, కొత్తగా 81 మందికి మంజూరయ్యాయని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అనుక్షణం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అందరూ వెన్నంటి ఉండాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, అడ్మిన్లు, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ వేడుకలు



వేడుకల్లో కె.కె.రాజును సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని మసీద్ వద్ద విశాఖపట్నం పీహెచ్‌పీ ఆధ్వర్యంలో గురువారం గ్యార్వీ షరీఫ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను ముస్లిం పెద్దలు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, కో ఆప్షన్ సభ్యులు ఎం.డి.షరీఫ్, ఆళ్ల శ్రీనివాసరావు, ఆషిక్, అలీభాయ్, ఇషాక్, సయ్యద్ అబ్రహాం, అబ్దుల్లా, వార్డు నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

8న వైదిక సదస్సు

సీతంపేట: శంకరమఠంలో ఈ నెల 8వ తేదీన కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పురోహిత, అర్చక వర్గ సభ్యులతో వైదిక సదస్సు నిర్వహించనున్నారు. విజయయాత్ర సందర్భంగా ఆయన శంకరమఠానికి ఇటీవల విచ్చేయగా.. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్సు నిర్వహిస్తున్నారని.. అర్చక, పురోహితులు స్వామి అనుగ్రహాన్ని పొందగలరని శంకరమఠం ప్రతినిధులు ఓ ప్రకటనలో కోరారు. సదస్సులో పాల్గొనే వారు 94415 03935, 99898 93557లో సంప్రదించవచ్చని తెలిపారు.

నిబద్ధతకు మారుపేరు రామకృష్ణంరాజు



రామకృష్ణంరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి దంపతులు

మురళీనగర్: శ్రీదేవి కేబుల్ టీవీ చానల్ చైర్మన్ దివంగత ఇసుకపల్లి రామకృష్ణంరాజు నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. మురళీనగర్‌లో గురువారం జరిగిన సంస్మరణ కార్యక్రమంలో మేయర్ దంపతులు రామకృష్ణంరాజు చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రామకృష్ణంరాజు అతి సామాన్య వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి నిబద్ధతతో పనిచేసి ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. డిజిటల్ ప్రసారాల్లో కొత్త అధ్యాయాన్ని సృష్టించారని, కేబుల్ రంగంలో ఆయన సేవలు మరువలేనివన్నారు. రామకృష్ణంరాజు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, నాయకుల నివాళి

ఇసుకపల్లి రామకృష్ణంరాజుకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, గొలగాని శ్రీనివాస్, మహారాజా బ్యాంకు చైర్మన్ మంతెన రామకృష్ణరాజు, ఎంఎస్‌వోలు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి



గాంధీ, అంబేడ్కర్, పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉత్తరాంధ్ర పార్టీ నాయకులు

సీతంపేట: గత పాలకుల నిర్లక్ష్యం వల్లే 75 ఏళ్లుగా ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబడి ఉందని ఉత్తరాంధ్ర పార్టీ వ్యవస్థాపకుడు మెట్ట రామారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఉత్తరాంధ్ర పార్టీ ఆవిష్కరణ, భవిష్యత్ కార్యాచరణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ దాదాపు రెండు కోట్ల జనాభా గల ఉత్తరాంధ్ర ప్రాంత నాయకుల మాట రాష్ట్ర మంత్రి వర్గంలో ఏనాడు చెల్లుబాటు కాలేదన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారానే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. మన ప్రాంతాలను మనమే అభివృద్ధి చేసుకునేందుకు పార్టీ స్థాపించామన్నారు. ఉత్తరాంధ్ర రైతులకు గోదావరి నీరు అందించడమే తమ పార్టీ లక్ష్యమని తెలిపారు. ఉత్తరాంధ్ర కొత్త రాష్ట్రంగా సాధించుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ నుంచి ఉత్తరాంధ్రలోని 53 అసెంబ్లీ, 8 లోక్‌సభ స్థానాలకు పోటీ చేస్తామని తెలిపారు. త్వరలో పార్టీ కార్యవర్గం, కమిటీలు, కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతీరావ్ పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదే



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బొలిశెట్టి సత్యనారాయణ

విశాఖ స్పోర్ట్స్: అంతర మీడియా స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా గురువారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోర్ట్ మైదానంలో ఈ పోటీలను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అండగా నిలిచే పాత్రికేయుల సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. వీజేఎఫ్‌కు సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన దుర్గారావు, శ్రీదేవి చానల్ రామకృష్ణంరాజు, బీజేపీ నాయకుడు పి.వి.చలపతిరావు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్, విస్జా ప్రతినిధులు, క్రికెట్ జట్ల సభ్యులు పాల్గొన్నారు. ఇప్పటికే అథ్లెటిక్స్, ఇండోర్ క్రీడలు ముగియగా.. క్రికెట్ పోటీలు ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

లోకల్ చానల్, కెమెరామెన్ జట్ల విజయం

తొలి రోజు జరిగిన పోటీల్లో లోకల్ చానెల్ జట్టు ఐదు వికెట్ల తేడాతో ప్రజాశక్తి జట్టుపై విజయం సాధించింది. ప్రజాశక్తి జట్టు తొలుత బ్యాటింగ్ చేసి మూడు వికెట్లకు 87 పరుగులు చేయగా.. లోకల్ చానల్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. మరో పోటీలో కెమెరామెన్ జట్టు ఆరు వికెట్లకు 127 పరుగులు చేయగా.. వెబ్ చానల్స్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 84 పరుగులతో ఆటను ముగించింది.

డీఆర్‌ఎంకు రోటరీ క్లబ్ సత్కారం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రతినిధులు గురువారం డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) అనూప్‌కుమార్ సత్పతిని ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డీఆర్‌ఎం ముఖ్య అతిథిగా మాట్లాడారు. తన గొప్పతనమంతా విశాఖవాసులు, ప్రజా ప్రతినిధులు, మీడియా, వాల్తేర్ టీం సభ్యులకు చెందుతుందని తెలిపారు. వీరందరి సహాయ సహకారాలతో ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికుల డిమాండ్‌లు, అవసరాలను తీర్చగలుగుతున్నానని చెప్పారు. రైల్వే ప్రయాణికులకు మరిన్ని సేవలందించే విషయంలో తన కృషి కొనసాగుతుందన్నారు. ప్రయాణికుల సౌకర్యాల మెరుగుకు వాల్తేర్ డివిజన్ తీసుకుంటున్న పలు చర్యలను గురించి ఆయన క్లుప్తంగా వివరించారు. భవిష్యత్తులో రైల్వేలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన ప్రపంచ స్థాయి సదుపాయాలను అందుబాటులోకి తీసకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ బి.మధు, సెక్రటరీ జి.శ్రీనివాస్, ఇతర ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవుడికి ధనుర్మాస సేవలు



వైభవ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహంతో ఆలయప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి గురువారం ధనుర్మాస సేవలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవ విగ్రహంతో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. ఉదయాస్తమాన సేవలు, ప్రత్యేక పూజలు జరిపారు. గోదాదేవి తరఫున శ్రీరంగనాథ స్వామికి పాశుర విన్నపం చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు



షిర్డీసాయిబాబా మైనపు విగ్రహం



ధ్యాన మందిరంలో అన్నదానం చేస్తున్న సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అఖండ హారతి దర్శనం, అభిషేకాలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు శాలువా, సాయిబాబా ఫొటోతో సత్కరించారు. మధ్యాహ్నం మందిరం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం హారతి, భజన, పల్లకీ సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, బాబా సేవకులు పాల్గొన్నారు.

స్నేహాంజలి మూర్తి శిష్య బృందానికి ఆహ్వానం

దాబాగార్డెన్స్: గత 33 ఏళ్లుగా దేశ విదేశాల్లో తెలుగు సంప్రదాయాలు, తమ కళా కార్యక్రమాలతో ప్రవాసాంధ్రులను అలరిస్తున్న స్నేహాంజలి ఆర్ట్స్ శిష్య బృందానికి ఆహ్వానం అందిందని ప్రోగ్రామ్ డైరెక్టర్ వి. శైలజామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న దేశ రాజధాని ఢిల్లీ ఆంధ్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలకు ఆహ్వానం పలికినట్టు ఆమె పేర్కొన్నారు. పల్లెల్లో జరిగే సంక్రాంతి పండగ వాతావరణాన్ని కళ్లకు కట్టేలా అనేక నృత్యరూపకాలతో ఢిల్లీలో గల ప్రవాసాంధ్రులను 15 మంది స్నేహాంజలి మూర్తి శిష్యబృందం అలరించనున్నట్టు ఆమె చెప్పారు.

పదునైన కత్తి వంటిది ప్రజాస్వామ్యం



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనురాధ

సీతంపేట: ప్రజాస్వామ్యం రెండు వైపులా పదునైన కత్తివంటిదని, పరిస్థితులను బట్టి మారుతుంటుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వై.వి.అనురాధ అన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖ పబ్లిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'చాలెంజెస్ కాన్‌ఫ్రాంటింగ్ ఇండియన్ డెమోక్రసీ' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. జిల్లా కలెక్టర్‌గా, వివిధ హోదాల్లో తను పనిచేసిన అనుభవాలను, పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని వివరించారు. అనంతపురం, గుంటూరు జిల్లాల్లో ఎదుర్కొన్న సమస్యలను తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఒక భాగస్వామ్యమన్నారు. జనాభా, వనరుల కొరత, ఎన్నికల విధానం, ప్రజాస్వామ్యంపై ప్రభావం చూపిస్తాయని చెప్పారు. నీటి పారుదల శాఖ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ యు.ఎన్.రాజు మాట్లాడుతూ పాలన సంస్కరణలకు సంబంధించి ప్రముఖులు చేసిన అభిప్రాయాలను వివరించారు. రాజకీయాలు, మతం అంశాలపై తన మనోభావాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఎ.ప్రసన్నకుమార్, పౌర గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్‌కుమార్, డి.ఎస్.వర్మ, డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

జ్ఞానాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న సంఘాల సభ్యులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో విశ్రాంత పోప్ బెనెడిక్ట్–16ను స్మరిస్తూ గురువారం సాయంత్రం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో క్రైస్తవులు సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయం నుంచి రక్షణగిరి ముఖద్వారం వరకు సంస్మరణ ర్యాలీ నిర్వహించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్‌లో ప్రార్థన స్థలాలు, గురు నిలయాలపై అల్లరి మూకల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మైనారిటీలపై దాడులు అరికట్టాలని, వారి ఆస్తులకు రక్షణ కల్పించాలన్నారు. ర్యాలీలో పీపీసీ సభ్యులు, అన్ని భక్త సంఘాల సభ్యులు, ఏపీసీయూ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా తొలగింపు

సీతంపేట: బాలల హక్కుల కమిషన్ ఆదేశాలతో అంగన్‌వాడీ ఆయాను విధుల నుంచి తొలగించారు. 25వ వార్డు సీతంపేట కనకమ్మ వారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా ఎస్.కె.రేష్మా బేగం మూడున్నరేళ్ల చిన్నారి ముఖంపై అగ్గిపుల్లతో చురకలు పెట్టిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనను సుమోటోగా తీసుకున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి, సీడీపీవోలు శ్రీలత, రమణకుమారి, వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాన్ని అప్పట్లో సందర్శించారు. చిన్నారి తల్లిదండ్రులను, అంగన్‌వాడీ వర్కర్ జె.సత్యవతిని, ఆయా రేష్మను, ఇతర సిబ్బందిని విచారించారు. తాను తప్పు చేసినట్టు ఆయా అంగీకరించడంతో దీనిని పరిగణలోనికి తీసుకున్న గొండు సీతారామ్ తొలగింపు చర్యలు చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్ పాత్ర ఏమైనా ఉందా అన్న దానిపై జిల్లా అధికార యంత్రాంగం నివేదిక సమర్పించాలని అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. దీనికి అనుగుణంగా ఆయాను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలతో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే వర్కర్ సత్యవతిని ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్లు, ఆయాలు పిల్లలను తల్లిగా సాకుతూ ప్రేమ, అభిమానం పెంపొందించేలా నడుచుకోవాలన్నారు. పిల్లలపై దాష్టీకాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలకు వెనకాడమని హెచ్చరించారు. కమిషన్ ఆదేశాలు అమలు చేసిన కలెక్టర్, యంత్రాంగానికి కమిషన్ తరఫున అభినందిస్తున్నట్టు ఆయన తెలిపారు.

నగర సుందరీకరణకు తొలి ప్రాధాన్యం

ఆరిలోవ: సుందర విశాఖ నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే ప్రధాన కర్తవ్యమని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. గురువారం ఫిషింగ్ హార్బర్ నుంచి జోడుగుళ్లపాలెం వరకు అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నగరానికి పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుందని, సదస్సులు, సమ్మిట్‌లు, నేషనల్ ఈవెంట్లు జరుగుతాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ముఖ్యంగా బీచ్ రోడ్డులో పారిశుధ్యం, భూగర్భ డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, రోడ్లు, కాలువలు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, పెయింటింగ్‌లు, ప్రజా మరుగుదొడ్ల శుభ్రత వంటి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్త జాలరిపేట మరుగుదొడ్ల ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు ఎత్తివేయించాలని, ఆ ప్రదేశంలో మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, డీసీపీ, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్, సహాయక ఇంజినీరు పాల్గొన్నారు.